




WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY


**పాఠకులకు ముఖ్య గమనిక**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు పత్రికకు సెలవు ప్రకటించడమైనది. తదుపరి సంచిక ఎల్లుండి యథావిధిగా వెలువడుతుంది.

పత్రికా యాజమాన్యం


సెప్టెంబర్ 14 సోమవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 222 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

MONDAY SEPTEMBER 14 2026 | VOL:18 | ISSUE: 222 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed


# ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం : సీఎం రేవంత్ రెడ్డి

### ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం

**హైదరాబాద్, సెప్టెంబర్ 13**

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం అధికంగా ఉన్న వాళ్లని, ఆర్యవైశ్యుల్లో చాలా మంది పేదలున్నప్పటికీ.. ఆత్మగౌరవం కోసం పేదలుగా గుర్తింపు తెచ్చుకోవడానికి ఇష్ట పడరని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగయత్ లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్,ఎంఎల్ ఏ లు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త, బండారి లక్ష్మారెడ్డి,ప్రకాష్ గౌడ్, మల్ రెడ్డి రంగా రెడ్డి, నవీన్ యాదవ్, ఎంఎల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, మాజీ ఎంపీ మధు యాష్కీ,ఆర్యవైశ్య ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కష్టాలు, బాధలు ఉన్నా సమాజంలో గౌరవం కోసం జీవించేవాళ్లు ఆర్య వైశ్యులని, నేను ఎప్పుడూ ఆర్యవైశ్యుల శ్రేయోభిలాషి నేనని అన్నారు. గ్రామంలో



ఎంత పేదవాడు పోయినా కనీసం తినడానికి అప్పు ఇచ్చే వాళ్లు ఆర్యవైశ్య సోదరులనీ అన్నారు. గ్రామంలో ఏ శుభకార్యం ఉన్నా మొదట గుర్తుకు వచ్చేది ఆర్యవైశ్య సోదరులే అని తెలిపారు. ప్రపంచంలో ఉన్నవి రెండే వృత్తులు.. అవి వ్యవసాయం, వ్యాపారం..

(మిగతా 2వ పేజీలో..)



# ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు : బ్రిక్స్ సభ్యదేశాలకు ప్రధాని మోడీ హెచ్చరిక

### నిబంధనలను పాటించడం కాదు.. మనమే రూపొందించాలని సూచన

### స్టార్టప్ ఇన్నొవేషన్ ఫండ్ ఏర్పాటుకు ప్రతిపాదన

న్యూఢిల్లీ : కీలక ఖనిజాలను ఆయుధాలుగా మారిస్తే అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని ప్రధాని నరేంద్ర మోడీ బ్రిక్స్ సభ్యదేశాలను హెచ్చరించారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికీ వాటిని తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ఆదివారం ప్రసంగిస్తూ 'సాంకేతిక తను, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం మన పురోగతికి ఆటంకం కలిగిస్తుంది. అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడంలో మేము అందరినీ కలుపుకొని వెళతాం' అని చెప్పారు. ప్రపంచంలో ఉద్రిక్తతలు నిరంతరం పెరిగిపోతున్నాయని

(మిగతా 2వ పేజీలో..)




# తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 13 విజయకెరటం ప్రతినిధి.**

రాష్ట్ర ప్రజలకు అధికారులకు ఉద్యోగస్తులకు వినాయక చవితి శుభాకాంక్షలురాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అధికారులు ఉద్యోగులు,కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ ఏకదంతున్ని ప్రార్థించిన ఎం బి కృష్ణ యాదవ్ టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు..



# పశ్చిమ బెంగాల్‌లో డీఆర్‌డీవో పరీక్ష కేంద్రం

న్యూఢిల్లీ : దేశ రక్షణ రంగానికి ఊతమిచ్చేలా.. క్షిపణి పరీక్షల సామర్థ్యాన్ని మరింత విస్తరించేలా కీలక ముందడుగు పడింది. డీఆర్‌డీవో పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఆయుధ, క్షిపణి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. బంగాళాఖాతం తీర ప్రాంతంలోని పూర్బా మేదినీపూర్ జిల్లా జున్‌పుట్ గ్రామంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీవో ప్రతిపాదనకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)



# విలువలు బతికితేనే బంధాలు బలపడతాయి

### ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పొన్నం కుటుంబం ఆదర్శం

### వ్యవసాయం, రైతుకు విలువ ఇవ్వడంలో పొన్నం సత్తయ్య స్ఫూర్తిదాయకం

### కొత్త తరానికి కుటుంబ విలువలు అందించాలి: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 13**

ఆస్తులు తరాలకు అందుతాయి.. కానీ విలువలు తరాలను కలుపుతాయి. కుటుంబ బంధాలు క్రమంగా బలహీనపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారంతో ముగ్గురు అన్నదమ్ములు ఐక్యంగా కొనసాగుతున్న పొన్నం కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు వక్తలు కొనియాడారు. వ్యవసాయం, రైతు సంక్షేమం, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు జీవితాంతం ప్రాధాన్యత ఇచ్చిన పొన్నం సత్తయ్య గౌడ్ ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు.

(మిగతా 2వ పేజీలో..)




# వారంలోనే ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల పత్రాలిస్తాం

### బ్రోకర్లు, మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు : వీపీ గౌతమ్

### 6,660 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి

ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజీ గృహాల లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఇప్పటివరకు 6,660 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు. మిగిలిన అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా నిర్ధారించబడిన లబ్ధిదారులకు ఈ వారంలోనే అధికారిక

(మిగతా 2వ పేజీలో..)





విజయకెరటం
తెలుగు దినపత్రిక

## ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు : బ్రిక్స్ సభ్యదేశాలకు ప్రధాని మోడీ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తూ అవి సాధారణ ప్రజల జీవితాలపై ప్రతికూ ల, విస్తృత ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.సంక్షోభాలు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కావడం లేదు మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరాలకు అంతరాయాలు...ఇలా ఏ సంక్షోభం ఎదురైనా అది ఒకే ప్రాంతానికి పరిమితం కావడం లేదని ప్రధాని అన్నారు. 'అందువల్లనే కష్టాలను తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాము. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధమవడం, తక్షణ చర్యలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. అంటు వ్యాధుల నివారణ కోసం బ్రిక్స్‌లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. హెచ్చరికల డేటాకు సంబంధించిన మార్గదర్శకాలను సిద్ధం చేశాము. బ్రిక్స్ సహకార వ్యవస్థ మన సరఫరాలను మరింత విశ్వసనీయంగా మారుస్తుంది' అని ఆయన వివరించారు. ప్రపంచ సంక్షోభాల నివారణ కోసం నిర్ణయాలు తీసుకోవడంతో గ్లోబల్ సౌత్ దేశాలు వెనుకబడుతున్నాయని చెప్పారు. ఈ దేశాలు నిబంధనలను పాటించేవిగా ఉండకూడదని, వాటిని రూపొందించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. అభివృద్ధి కోసం కృషి చేసే సమయంలో పర్యావరణానికి హాని కలిగించవద్దని మోడీ సూచించారు. మానవాభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యత అవసరం మానవాభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరముందని ప్రధాని నొక్కిచెప్పా రు. సుస్థిరతకు ఇదే పునాది అని,ఆ దిశగా భారత్ అనేక కార్యక్రమాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వకోసం బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించామన్నారు. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిం చి ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత,స్థితిస్థాపకత అనే నాలుగంశాలపై తమ ప్రయత్నాలను కేంద్రీకరించామని, సభ్యదేశాల సహకారం, మద్దతుతో ఉమ్మడి దృక్పథాన్ని అందరికీ ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలగడం తనకు సంతోషాన్ని కలిగించిందని మోడీ చెప్పారు. సహకారంలో అందరినీ భాగస్వాములను చేయాలి...ఆవిష్కరణల విభాగంలో బ్రిక్స్ ఇంక్యుబేటర్ వ్యవస్థ సభ్యదేశాల స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానిస్తుందని మోడీ తెలిపారు. వినూత్నమైన, విస్తరించదగిన పరిష్కారాలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. డిజిటల్ వ్యవసాయంపై రైతులకు బ్రిక్స్ నెట్‌వర్క్ నూతన అవకాశాలను సృష్టిస్తుందని, దీని ద్వారా ఏఐ, జియోస్పేషియల్ టెక్నాలజీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లను రైతుల వాస్తవ అవసరాలకు అనుగుణంగా అనుసంధానించడం జరుగుతుందని మోడీ వివరించారు. స్నేహం, భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించుకోవడానికి బ్రిక్స్ వేదికను భారత్ ఉపయోగించుకున్నదని ఆయన అన్నారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అంటూ పారిశ్రామికవేత్తలు, రైతులు, పరిశోధకులు, మహిళలు, యువతతో పాటు సాధారణ పౌరులనూ భాగస్వాములను చేయాలని అభిప్రాయపడ్డారు. 'నైపుణ్యాలు, శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని, సామాజిక భద్రతను, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించామని, చిన్న పారిశ్రామికవేత్తల కోసం బ్రిక్స్ ఎంఎస్ఎంఈ సహకార పోర్టల్‌ను ప్రారంభించామని ప్రధాని తెలిపారు.

## పశ్చిమ బెంగాల్‌లో డీఆర్‌డీవో పరీక్ష కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిపాదిత కేంద్రం.. ఒడిశాలోని చాందీపూర్‌లో ప్రస్తుతం ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్)కు అనుంబంధంగా ఉంటుంది. దీనిపై పనిభారాన్ని తగ్గించి, తూర్పు తీరంలో దేశ రక్షణ పరీక్షల సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మేదినీపూర్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని 2024 ఏప్రిల్‌లోనే డీఆర్‌డీవో ప్రతిపాదించింది. కానీ, అప్పటి తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పందించలేదని, భూ కేటాయింపులు చేయలేదని పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి తెలిపారు.

## వారంలోనే ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల పత్రాలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపు పత్రాలు (అల్లాట్ మెంట్ లెటర్స్) జారీ చేస్తామని తెలిపారు. లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థులు తమకు ఇల్లు కేటాయించ బడుతుందా లేదా అనే ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన మరియు అర్హత నిర్ధారణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, మధ్యవర్తులు ఇల్లు మంజూరు చేయిస్తామని లేదా అధికారులతో మాట్లాడి సహాయం చేస్తామని చెబుతూ అమాయక లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. "గృహాల కేటాయింపు ప్రక్రియలో బ్రోకర్లు, మధ్యవర్తులు లేదా ఇతర వ్యక్తులకు ఎలాంటి పాత్ర లేదు. లబ్ధిదారులు ఎవరికీ లంచం, కమీషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దు. గృహాల కేటాయింపు పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన అర్హతలు అధికారిక ప్రక్రియ ఆధారంగానే జరుగుతుంది" అని వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు. గృహానికి సంబంధించిన మొదటి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లించాల్సిన మొత్తం, చెల్లింపు గడువు మరియు ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటే అధికారికంగా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. కేటాయింపు పత్రంలో పేర్కొన్న అధికారిక బ్యాంకు ఖాతాకు మాత్రమే నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. ఇతర వ్యక్తులు తెలిపే ఖాతాలకు లేదా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు జమ చేయవద్దని హెచ్చరించారు. ఇల్లు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగినా లేదా అనధికారిక ఖాతాలకు చెల్లించాలని కోరినా వెంటనే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.లబ్ధిదారులు గృహాల కేటాయింపు, క్షేత్రస్థాయి పరిశీలన, కేటాయింపు పత్రాలు, మొదటి విడత చెల్లింపు తదితర అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ టీజీహెచ్బి.తెలంగాణ.జీవోవి.ఇన్ ను సందర్శించవచ్చు లేదా కాల్ సెంటర్ నంబరు 040-24603572ను సంప్రదించవచ్చు. తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారికంగా జారీ చేసే ప్రకటనలు, కేటాయింపు పత్రాలు, సంబంధిత అధికారుల సూచనలను మాత్రమే విశ్వసించాలని వైస్ ఛైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం : సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వైఎస్‌లు గల్లాపెట్టె నిర్వహణ బాధ్యతను ఆర్యవైశ్యులకే ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. జూన్ 2, 2014న తెలంగాణ ఏర్పాటు అయిన నాడు 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడిందంటే కారణం ఆనాటి ఆర్థిక మంత్రి రోశయ్యని అన్నారు. శాసనమండలిలో దూకుడుగా నేను మాట్లాడితే రోశయ్య నన్ను పిలిచి ఆవేశం తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే పైకి వస్తామని ఆశీర్వదించారు. నన్ను ముందు గుర్తించింది రోశయ్య.. రోశయ్య విమర్శించే వారు కాదు, తిట్టే వారు కాదు.. రోశయ్య చురకలు వేసేవారు అన్నారు. రాష్ట్రం విడిపోయినా రోశయ్య గౌరవాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున ఆయన విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. రోశయ్య విగ్రహం ఏర్పాటు పైన కొంతమంది విమర్శలు చేశారు. నాలుగు దశాబ్దాల క్రితమే నేను హైదరాబాద్‌కు వచ్చాను.. మంచైనా, చెడైనా నాది ఇక హైదరాబాద్ అని రోశయ్య తెలిపారని, ఆయన మాటలను గౌరవించి విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఆర్యవైశ్యులను వివిధ ప్రాంతాల్లో రకరకాల పేర్లతో పిలుస్తారు. ప్రపంచ స్థాయి నాయకుడు ఒకే ఒక్కరు మహాత్మా గాంధీ. ప్రపంచంలో ఏ దేశం పోయినా మహాత్మా గాంధీ గొప్పతనం తెలియని వారు ఉండరు, భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదిగిన ఆర్యవైశ్య బిడ్డ మహాత్మా గాంధీ అని వివరించారు. ప్రపంచస్థాయి నేతగా గుర్తింపు తెచ్చుకున్న మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడం గర్వ కారణం అన్నారు. అనేక మంది ఆర్యవైశ్య ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారు. పొట్టి శ్రీరాములు పోరాటం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. దేశ సమగ్రత కోసం మహాత్మాగాంధీ ప్రాణాలు ఇస్తే, పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఆర్యవైశ్యులకు రావాల్సిన గుర్తింపు రాలేదని, ఆర్యవైశ్యుల పట్ల మా ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. పేదల ఆర్యవైశ్య బిడ్డలకు ఆత్మగౌరవ భవనం సంపూర్ణంగా ఉపయోగ పడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణం కోసం సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులందరూ కలిసి ఉంటేనే మీకు బలం.. సమైక్యంగా ఒక్కతాటిపై నడిస్తే అందరూ గౌరవిస్తారని స్పష్టం చేశారు. ఆర్యవైశ్యులకు ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చాం, కొడంగల్‌లో ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య కులానికి చైర్మన్ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలి.. కలిసి కట్టుగా ఉన్నప్పుడు ఇది సాధ్యమవుతుందన్నారు.

# విలువలు బతికితేనే బంధాలు బలపడతాయి

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవన సాఫల్య పురస్కారాల కార్యక్రమం విలువలకు వేదికగా మారింది.

వ్యవసాయమే గ్రామీణ జీవనానికి ఆధారం

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ సమాజంలో వ్యవసాయానికి, రైతుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వ్యవసాయానికి విలువనిస్తూ రైతు జీవితాన్ని గౌరవించిన వ్యక్తిగా పొన్నం సత్తయ్య నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు బలంగా ఉండేవని, కుటుంబంలో ఎవరికైనా కష్టం వస్తే మరొకరు అండగా నిలిచేవారని గుర్తుచేశారు. పెద్దలు తమ అనుభవాలను చిన్నవారికి పంచుకోవడం, చిన్నవారు తమ సమస్యలను పెద్దలతో చెప్పుకోవడం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పతనమన్నారు. బంధాలు బలహీనమైతే.. సమాజంపైనా ప్రభావం. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతుండటంతో కుటుంబ బంధాలు బలహీనపడు తున్నాయని, దాని ప్రభావం సమాజంపైనా పడుతోందన్నారు. ఒంటరితనం, అసంతృప్తి, కుటుంబ సమస్యలు పెరుగుతున్న పరిస్థితుల్లో మానవ సంబంధాలు, కుటుంబ విలువలను కొత్త తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పొన్నం సత్తయ్య జీవితం కుటుంబ విలువలు, మానవత్వం, వ్యవసాయం పట్ల నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

పొన్నం కుటుంబం.. విలువలకు ప్రతిరూపం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పొన్నం కుటుంబంతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పుడూ ప్రేమ, ఆప్యాయతలతో అందరినీ పలకరిస్తూ ఉంటారని, కాంగ్రెస్‌లోని ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులను సోదరభావంతో కలుపుకుపోయే నాయకుడిగా ఉన్నారని చెప్పారు. పొన్నం సత్తయ్య చూపిన మార్గం, కుటుంబ విలువలు నేటికీ కుటుంబంలో కొనసాగుతున్నాయని, ముగ్గురు అన్నదమ్ములు ఐక్యంగా, ప్రేమగా ఉండటం ఎంతో సంతోషాన్ని కలిగించే విషయమన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు, పరస్పర సహకారం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని, తండ్రి ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య, శిక్షణ, అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఉన్నత చదువులు, విదేశీ విద్యకు పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలకు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. పేదలు, బలహీన వర్గాల కోసం చేస్తున్న సేవల వల్ల ప్రభాకర్‌కు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, సేవాభావమే అందుకు కారణమన్నారు.

'జై తెలంగాణ' నినాదం నుంచి మంత్రి స్థాయికి

మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. యువజన కాంగ్రెస్‌లో పోరాట స్ఫూర్తిని నింపి, ఎక్కడ ఉద్యమం జరిగినా ముందుండేవారని తెలిపారు. పార్లమెంట్‌లోనూ బలంగా 'జై తెలంగాణ' నినాదాన్ని వినిపించారని అన్నారు. ఆ పోరాట స్ఫూర్తి, ప్రజల పట్ల నిబద్ధతలో పొన్నం సత్తయ్య విలువల ప్రభావం కనిపిస్తోందన్నారు.

రైతు గౌరవమే నాకు దక్కిన గౌరవం

వ్యవసాయ పురస్కార గ్రహీత, వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి మాట్లాడుతూ తనకు దక్కిన పురస్కారం వ్యక్తిగత గౌరవం కాదని, తెలంగాణ రైతులకు దక్కిన గౌరవమన్నారు. తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, చిన్ననాటి నుంచే వ్యవసాయంతో అనుబంధం ఉందన్నారు. రైతుల అప్పులు, ప్రకృతి వైపరీత్యాలు, కౌలు రైతులు, చిన్న రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రస్తావించారు. రైతులు సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని, రైతు సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ఐదో ఏడాది నుంచి వ్యవసాయానికీ పురస్కారం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తండ్రి పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరిస్తున్నామని తెలిపారు. గత ఏడాది వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనతో ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా పురస్కారాల్లో చేర్చామని చెప్పారు. వ్యవసాయ రంగంలో రైతుల సమస్యల కోసం, వ్యవసాయ అభివృద్ధి కోసం పోరాడుతున్న ఎం. కోదండరెడ్డిని ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, జానపద కళారంగంలో గొట్టె కనకవ్వలను సత్కరించారు. ఒక్కొక్కరికి జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందించారు. తల్లిదండ్రులు ఇచ్చేది ఆస్తి కాదు.. విలువలు. తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా తమకు విద్య, క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పించారని పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తమకు వ్యవసాయం విలువ, రైతు కష్టం తెలుసునని పేర్కొన్నారు. తండ్రి పేరుతో కార్యక్రమాన్ని కొనసాగించడం ద్వారా ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు.

తండ్రి కష్టం.. పిల్లల విజయాలుగా

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య తన జీవితాన్ని వ్యవసాయంతో పాటు పిల్లల భవిష్యత్తు కోసం అంకితం చేశారని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనులు చేస్తూనే పిల్లలను ఉన్నతంగా చదివించాలనే దూరదృష్టితో వ్యవహరించారని తెలిపారు. ఆయన ముగ్గురు కుమారులు వివిధ రంగాల్లో రాణించడం తండ్రి కష్టం, విలువలకు ప్రతిఫలమన్నారు. ఆస్తులకంటే విలువలే గొప్ప వారసత్వం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే గొప్ప వారసత్వం ఆస్తులు కాదని, మంచి ఆలోచనలు, ధైర్యం, విలువలు, కష్టాలను ఎదుర్కొనే శక్తి అని అన్నారు. కుటుంబం ఇచ్చే మానసిక బలం కష్టకాలంలో ఎంతో అవసరమని చెప్పారు. కుటుంబాల్లో ప్రేమ, గౌరవం, సహకారం పెరిగితే సమాజంలోనూ శాంతి, సామరస్యం పెరుగుతాయని అన్నారు.

ప్రతిభకు గుర్తింపు.. సమాజానికి స్ఫూర్తి

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులతో పాటు సంస్కారం, సంప్రదాయం, సానుభూతి, మానవత్వాన్ని అందిస్తారని అన్నారు. ప్రస్తుతం మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, కుటుంబ కలహాలు, హింస పెరుగుతున్న పరిస్థితుల్లో తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యత మరింత అవసరమని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నం సత్తయ్య మానవ విలువలు, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు ప్రతీక అని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను తరతరాలకు అందించాలనే ఉద్దేశంతో పురస్కారాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సాహిత్య పురస్కార గ్రహీత వెలిచాల కొండల్‌రావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, అభిప్రాయాలు, ఆలోచనలకు ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. భిన్నమైన భావాలు, సిద్ధాంతాలకు చెందిన వ్యక్తులు ఒకే వేదికపై కలవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు.

విలువలకు వేదికగా.. సేవలకు గుర్తింపుగా

పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు--2026లో వ్యవసాయ రంగానికి ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగానికి వెలిచాల కొండల్‌రావు, జానపద కళారంగానికి గొట్టె కనకవ్వలను ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్,వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పొన్నం కుటుంబ సభ్యులు, అభిమానులు, సాహిత్య, కళా, వ్యవసాయ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



# భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా వ్యాపింప చేయాలి





**నల్లగొండ సెప్టెంబర్ 13 విజయకేరటం ప్రతినిధి**

భారతీయ సంస్కృతిని, కళలను ప్రపంచవ్యాప్తంగా. విస్తృత పర్చేందుకు భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కప్) కృషి చేస్తుందని హైకోర్టు న్యాయవాది, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు పేర్కొన్నారు. ఆదివారం నల్గొండ లోని ఐఎంఏ హాల్లో ఇస్కఫ్ నల్గొండ జిల్లా మహాసభలు డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాలు ఆంధ్ర రాజ్యాల దురాక్రమలను ప్రశ్నించడం ను హర్షించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సైతం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంకులలో తగిన స్థానం కోరటం సహితమైనది కాదన్నారు. గత 80 సంవత్సరాలుగా ఇస్కాఫ్ దేశ సమైక్యత, సమగ్రత కోసం కృషి చేస్తుందన్నారు. ఇటీవల వెనుజుల అధ్యక్షులు మదురోని అక్రమంగా అమెరికా సైన్యం అరెస్టు చేసి న్యూయార్క్ జైల్లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఐ ఏ ఎల్ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఇరాన్ పై అకారణంగా అమెరికా యుద్ధం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయంగా ప్రపంచ దేశాల శాంతి అలీన ఉద్యమ బలోపేతం, పాలస్తీనా, ఇరాక్ సరిహద్దు వివాదాల వంటి వాటిపై ఇస్కాఫ్ పోరాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు కారింగు బిక్షమయ్య, కరీం, కోశాధికారి అవ్వ విజయలక్ష్మి ,న్యాయవాదులు మునగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు, కట్ట అనంతరెడ్డి, కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు ఆర్ రమేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఇస్కాఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, కోశాధికారిగా బి రామలింగం లతో పాటు 35 మందితో జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కాంగ్రెస్‌ను వీడేది లేదు!





**మాట తప్పం.. వెన్నుపోటు సహించం!**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 13 :**

కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ కొండా మురళీ తేల్చిచెప్పారు. ఆదివారం వరంగల్ బస్టాండ్ సమీపంలోని ఎం.కె. నాయుడు హోటల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు కీలక వ్యాఖ్యలు చేశారు. "పదవులు ఉంటాయి.. పోతాయి.. కానీ మాటపై నిలబడతాం" అని కొండా మురళీ స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. బీసీల కోసం ముందుకొచ్చే నాయకత్వం అవసరమన్నారు. తనపై కబ్జా ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. ఢిల్లీ రావాలని తనకు ఫోన్ వచ్చిన విషయం నిజమేనని, "రేవంత్‌కు అన్ని విషయాలు తెలుసు" అన్నారు. తన శరీరంలో ఇంకా నాలుగు బుల్లెట్లు ఉన్నాయని, కార్యకర్తల ఆశీస్సులే తన బలమని చెప్పారు. కార్యకర్తల కోసం మరో పది ఎకరాలు అయినా అమ్ముతానని స్పష్టం చేశారు. వరంగల్ తూర్పులో 24 మంది కార్పొరేటర్లను గెలిపించడమే లక్ష్యమన్నారు. తూర్పు బాధ్యతలను నవీన్‌రాజ్‌కు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు.

**పదవి పోయినా.. కాంగ్రెస్ మారదు!**

గత పది రోజులుగా కార్యకర్తలు మనోవేదనకు గురయ్యారని కొండా సురేఖ అన్నారు. పదవి లేకపోయినా ప్రజలకు సేవ చేయవచ్చని, పదవి కేవలం అలంకారప్రాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన పదవికి ఎక్కడా మచ్చ తీసుకురాలేదన్నారు. "కాంగ్రెస్‌ను వీడేది లేదు.. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచే పోటీ చేస్తా" అని కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ తూర్పు 100 శాతం తనకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ జరిగితే తప్ప మార్పు ఉండదన్నారు. రాహుల్‌గాంధీ లక్ష్యం బీసీలను పైకి తీసుకురావడమేనని తెలిపారు. తమపై వస్తున్న వార్తల విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీలో ఉంటూ పార్టీకి వెన్నుపోటు పొడవద్దని కొండా మురళీ హెచ్చరించారు. కార్యకర్తలే తమ బలమని, అన్ని వర్గాలను కలుపుకొని కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని కొండా దంపతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ నవీన్ రాజ్ గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్, సీనియర్ నాయకులు మోతిలాల్, మాజీ కార్పొరేటర్లు ఫుర్ఖాన్,అనిల్ కుమార్, భాస్కర్, సురేష్, సురేష్ జోషి, డివిజన్ అధ్యక్షులు,మాజీ డివిజన్ అధ్యక్షులు, మహిళ డివిజన్ నాయకురాలు, జిల్లా నాయకురాలు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



# తిప్పర్తి మండలంలో వినాయక చవితి పీస్ కమిటీ సమావేశం



**తిప్పర్తి, సెప్టెంబర్ 13 విజయ కెరటం ప్రతినిధి**

తిప్పర్తి మండల పరిధిలో నిర్వహించనున్న వినాయక చవితి మరియు గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి తిప్పర్తి ఎస్సై ఇరుగు రవి గారు అధ్యక్షత వహించారు. మండలంలోని గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై గారు మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు.వినాయక విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపుల సమయంలో పోలీసుల సూచనలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాలను సోదరభావంతో నిర్వహించాలని సూచించారు.గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు, విద్యుత్ ప్రమాదాల నివారణ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తిప్పర్తి మాజీ సర్పంచ్ రొట్టెల రమేష్ తిప్పర్తి మజీద్ కమిటీ అధ్యక్షులు మహబూబ్ జానీ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 6,013 కేసుల పరిష్కారం

**ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లక్ష్యం : జిల్లా ఎస్పీ**

**నల్లగొండ సెప్టెంబర్ 13 విజయ కెరటం ప్రతినిధి**

ఈ నెల 12-09-2026 న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం మరియు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించబడినవి. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించబడిందిని జిల్లా ఎస్పి గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం 6,013 కేసులు విజయవంతంగా పరిష్కరించబడినవి. వాటి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:



DD కేసులు : 3,121
E-Petty కేసులు :2,208
IPC కేసులు : 672
SLL కేసులు : 12

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ,జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం మరియు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. అదేవిధంగా, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని జిల్లా ఎస్పీ గారు అభినందించారు.

# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి!

**లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా: జిల్లా కలెక్టర్ డా. సత్యశారద**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 13:**

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. సత్యశారద సూచించారు. వర్షాల పరిస్థితిపై అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె.. ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రత్యేక అప్రమత్తత అవసరమని కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.



**లోతట్టు ప్రాంతాలపై నిఘా.. ప్రజల భద్రతే ప్రథమం**

వర్షాల తీవ్రతను బట్టి అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యవసర సమాచారం కోసం 9154252936 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

## బిగ్ బాస్ షో నుంచి పారిపోయేందుకు గోడెక్కిన తమిళ కంటెస్టెంట్..



ప్రముఖ రియాలిటీ షో బిగ్ బాస్ తమిళం 10వ సీజన్ ప్రారంభమైన రెండో రోజే అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కంటెస్టెంట్ ఏకంగా హౌస్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించి అందరినీ షాక్‌కు గురిచేశాడు. ఈ ఘటనతో షోలో ఒక్కసారిగా కలకలం రేగింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 6న ప్రారంభమైన బిగ్ బాస్ తమిళం 10వ సీజన్‌లో కంటెస్టెంట్‌గా అడుగుపెట్టిన ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్, కమెడియన్ మహ్మద్ అన్సార్.. షో ప్రారంభమైన రెండో రోజే హౌస్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. ప్రధాన ద్వారం మూసి ఉండటంతో, అతను ఏకంగా హౌస్ చుట్టూ ఉన్న ఎత్తైన గోడను ఎక్కి బయటకు దూకేందుకు సిద్ధమయ్యాడు.అతని చర్యను గమనించిన తోటి కంటెస్టెంట్లు వెంటనే అప్రమత్తమై అక్కడికి పరుగెత్తుకొచ్చారు. గోడ దిగి రావాలని కోరుతూ, అతడిని ఆపేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ, అన్సార్ వారి మాటలు వినకుండా బయటకు వెళ్లాలనే పట్టుదలతో కనిపించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే, అన్సార్ ఇంత తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా అధికారికంగా తెలియరాలేదు. హౌస్‌లో నాయకత్వం విషయంలో ఏర్పడిన విభేదాలు లేదా తోటి సభ్యులతో గొడవలే ఈ చర్యకు కారణమై ఉండవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 'కలక్క పోవదు యారు', 'కేపీవై ఛాంపియన్స్', 'కుకు విత్ కోమాలి' వంటి షోలతో పేరుగాంచిన అన్సార్, ఈ సీజన్‌లోని 19 మంది కంటెస్టెంట్లలో ఒకరిగా అడుగుపెట్టాడు. ఈ ఘటన అతని ఎలిమినేషన్‌కు దారితీస్తుందా లేదా రాబోయే ఎపిసోడ్లలో దీనిపై బిగ్ బాస్ ఏమైనా స్పందిస్తాడా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్‌లో ఇదే మొదటి పెద్ద వివాదంగా నిలిచింది.

## బాక్సాఫీస్ వద్ద 'ఇరుముడి' సంచలనం.. రవితేజ అరుదైన ఫీట్

**రవితేజ 'ఇరుముడి' చిత్రానికి రికార్డు స్థాయిలో ప్రేక్షకాదరణ**

**తెలుగు రాష్ట్రాల్లో 1.25 కోట్ల మందికి పైగా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించిన చిత్రం**

**సింగిల్ డే టికెట్ సేల్స్‌లో 'పెద్ది' రికార్డును అధిగమించిన 'ఇరుముడి'**

**అయ్యప్ప దీక్ష, తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌కు ప్రేక్షకుల ఫిదా**

**నాలుగో వారంలోనూ తగ్గని 'ఇరుముడి' ప్రభంజనం**

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వచ్చిన డివోషనల్ డ్రామా 'ఇరుముడి' తెలుగు బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆగస్టు 21న విడుదలైన ఈ చిత్రం, వసూళ్ల కంటే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) పరంగా అరుదైన రికార్డును నెలకొల్పింది. నాలుగో వారంలోనూ విజయవంతంగా ప్రదర్శితమవుతూ, ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల్లో 1.25 కోట్ల మందికి పైగా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించిన చిత్రంగా నిలిచింది.విడుదలైన తొలి ఆదివారమే ఏకంగా 11 లక్షల టికెట్లు అమ్ముడై, గతంలో 'పెద్ది' సినిమా పేరిట ఉన్న 9.47 లక్షల టికెట్ల రికార్డును 'ఇరుముడి' అధిగమించింది. సాధారణ టికెట్ ధరలతోనే ఈ స్థాయి ఫుట్‌ఫాల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. రాబోయే భారీ చిత్రాలకు సైతం ఇది కఠినమైన బెంచ్‌మార్క్‌గా నిలవనుంది. అయ్యప్ప దీక్ష నేపథ్యంతో పాటు తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న బలమైన అనుబంధాన్ని శివ నిర్వాణ హృద్యంగా తెరకెక్కించారు. ఈ భావోద్వేగాలే సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రాన్ని చూసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు ట్రాక్టర్లలో థియేటర్లకు తరలివచ్చిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు.





## నా ఫ్యామిలీ, నా ఇష్టం.. వైరల్ అవుతున్న ఐశ్వర్య రాయ్ మాటలు

తల్లిదండ్రులతో కలిసి ఉండటంపై ఐశ్వర్య రాయ్ పాత ఇంటర్వ్యూ వైరల్

అమెరికాలో యువత ఇల్లు విడిచి వెళ్లడంపై ఆసక్తికర వ్యాఖ్యలు

పని ఒత్తిడి వల్ల కుటుంబంతో గడిపే సమయం చాలా తక్కువన్న ఐష్

ఇల్లు వదిలి వెళ్లడమే స్వాతంత్ర్యానికి నిదర్శనం కాదని వ్యాఖ్య

ప్రపంచ మాజీ సుందరి, ప్రముఖ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్‌కు సంబంధించిన ఒక పాత ఇంటర్వ్యూ క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కెరీర్‌లో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, తల్లిదండ్రులతోనే కలిసి నివసించడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాశ్చాత్య సంస్కృతికి, భారతీయ జీవన విధానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఈ వీడియోలో ఆమె స్పష్టంగా వివరించారు. అమెరికాలో యువత యుక్త వయసు రాగానే తల్లిదండ్రులను విడిచి సొంతంగా నివసించడంపై ఐశ్వర్య ఆ ఇంటర్వ్యూలో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "అక్కడ అది ఒక సామాజిక నియమమా? అందరూ తప్పనిసరిగా ఇల్లు విడిచి వెళ్లిపోవాలా? ఎందుకో అది నాకు అర్థం కావడం లేదు" అని ఆమె ప్రశ్నించారు. ముప్పై ఏళ్లు పైబడిన విజయవంతమైన అమెరికన్ మహిళలు సాధారణంగా తల్లిదండ్రులతో కలిసి ఉండరని ప్రస్తావించినప్పుడు, ఐశ్వర్య తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "వృత్తిరీత్యా నేను నిరంతరం ప్రయాణాలు చేస్తుంటాను. దీంతో కుటుంబంతో గడిపే సమయం చాలా తక్కువగా ఉంటుంది. అరుదుగా లభించే ఆ కలిసి భోజనం చేసే సమయాన్ని మేము ఎంతో విలువైనదిగా భావిస్తాం" అని ఆమె తెలిపారు. తాను పూర్తి స్వతంత్రురాలినని పేర్కొంటూనే.. "తల్లిదండ్రులకు దూరంగా వెళ్లిపోవడమే స్వేచ్ఛకు నిదర్శనమని నేను భావించడం లేదు" అని ఆమె స్పష్టం చేశారు. 1994లో 'మిస్ వరల్డ్' కిరీటం గెలుచుకున్న ఐశ్వర్య రాయ్, తమిళ చిత్రం 'ఇరువర్' (తెలుగులో 'ఇద్దరు')తో సినీ రంగ ప్రవేశం చేశారు. అభిషేక్ బచ్చన్‌ను వివాహం చేసుకున్న ఆమె, ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో క్రమం తప్పకుండా పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528